క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సగర సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని చిత్తారమ్మ ఆలయ వార్షికోత్సవానికి సంబంధించి పోస్టర్లను ఆదివారం సగర సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈనెల 20 నుంచి 23 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ మేరకు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు ప్రకటించారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న శ్రీధర్ గుప్తా

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి ఓ దాత రూ.1 లక్ష 11వేల విరాళం అందజేశారు. నర్సాపూర్‌కు చెందిన వ్యాపారి, బీఆర్ఎస్ నాయకుడు పైడి శ్రీధర్ గుప్తా ఆదివారం ఆలయ ఆవరణలో ఈ విరాళాన్ని అందజేశారు. స్వయంభూగా వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి తనవంతు సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నట్లు శ్రీధర్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, నోముల హనుమంత్ గుప్తా, సర్పంచ్ అశోక్, గ్రామస్తులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



శ్రమదానం చేస్తున్న గ్రామ యువకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు 247 వారాలుగా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చేపడుతూ.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆదివారం గ్రామంలోని పలు వీధులను శుభ్రం చేసి, రోడ్డులకు ఇరువైపుల మొక్కలను నాటారు. అనంతరం గ్రామంలో ప్లాస్టిక్ వాడకం, మొక్కల పెంపకం గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు.

మల్లన్నను దర్శించుకున్న సర్పంచ్‌లు




మల్లన్నను దర్శించుకుంటున్న సర్పంచ్‌లు

చిన్నశంకరంపేట (మెదక్): మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు ఆదివారం కోమురవెల్లి మల్లన్నను దర్శించుకున్నారు. కొండపోచమ్మ దర్శనం అనంతరం మల్లన్నను దర్శించుకున్నారు.

సదస్సును విజయవంతం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరాబాద్ శుభం గార్డెన్‌లో జరిగే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేశ్ కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలని ఆయన కోరారు.

గోశాల నుంచి ఎద్దుల పంపిణీ



రైతులకు ఎద్దులు అందిస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయం చేయడానికి అవసరం ఉన్న రైతులకు ఆదివారం మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి గోశాల నుంచి ఎద్దులను పంపిణీ చేశారు. తూప్రాన్ మండలం వెంకటాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు నక్కలపల్లి మల్లేశ్‌యాదవ్, నక్కలపల్లి నవీన్‌యాదవ్‌లకు గోశాల నిర్వాహకులు ఎద్దులు అందజేశారు. దానం ఇచ్చిన ఎద్దులతో సాగు పనులు చేసుకోవాలని అమ్మకాలు చేస్తే.. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని గోశాల నిర్వాహకులు శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫణిశశాంక్‌శర్మ, ఎంపీటీసీ లక్ష్మి, మండల కో ఆప్షన్ మెంబర్ లాయక్ గ్రామస్తులు ఉన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి



రామాయంపేట(మెదక్): ఆలయంలో దీపాలంకారణ చేస్తున్న భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకుల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన శ్రీ చాముండేశ్వరీ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవురోజు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పక్కనే ఉన్న మంజీరా నదిలో భక్తుల స్నానమాచరించి, భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు.

తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి అభిషేకం నిర్వహించి, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు తీయడంతో పాటు ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించగా, వాహనాలకు సైతం పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు.

రామచంద్రస్వామి ఆలయంలో ..

రామాయంపేట(మెదక్): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక కళ్యాణ రామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ మేరకు భక్తులు దీపాలంకరణ చేశారు. ఇందులో భాగంగా ఈనెల 14న గోదా రంగనాథుల కళ్యాణోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

సికింద్లాపూర్‌లో ..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ శశిధర్ తెలిపారు. రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో..

మనోహరాబాద్(తూప్రాన్): లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో గ్రామస్తులు వనభోజనాల కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ లావణ్య దంపతుల ఆధ్వర్యంలో స్వామి కళ్యాణం నిర్వహించారు. కాగా గ్లోబల్ అల్యూమినియం పరిశ్రమ వాళ్లు రూ. లక్ష 116 దేవాలయ వేడుకలకు విరాళం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీతరవి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేశ్, నాయకులు భాషబోయిన చంద్రశేఖర్, పంజా భిక్షపతి, రంగాయపల్లి సర్పంచ్ నాగభూషణం, శ్రీనివాస్‌గౌడ్, గురుస్వామి ప్రభాకర్‌గౌడ్, పాలకవర్గం సభ్యులు, పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా ధనుర్మాసం సందర్భంగా ప్రతి సంవత్సరం జనవరిలో ఆదివారం ఆనవాయితీగా గ్రామస్తులంతా కలిసి వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, చుట్టుపక్కల వాళ్ళు ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ అర్చకుడు అయ్యవారి నవీన్ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో..

బంగారు పాదుకలు అందజేత

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పసుపులేటి ఒడ్డున గల శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయానికి రెండు బంగారు పాదుకలు, రెండు బంగారు చేతులు, ఒక బంగారు తొట్టెల, మొత్తం ఏడు తులాల ఒక గ్రాము ఆభరణాలు అమ్మవారికి బహూకరించారు. ఆదివారం బండారి నితిన్ గౌడ్, మధు శ్రీ దంపతులకు పుత్రుడు చిరంజీవి వాహిన్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఇచ్చినట్లు పూజారి శ్రీవాండ్ల శ్రీనివాసశర్మ తెలిపారు. కార్యక్రమములో గూడెం మాలతి గౌడ్ , ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటయ్య గౌడ్, గలగం అమర్నాథ్ గౌడ్ , మెదక్ గీతా పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు గద్దమీది కృష్ణ గౌడ్ , దేవాలయ అధ్యక్షులు కొండన్ సురేందర్ గౌడ్ , జంగంపల్లి భిక్షపతి గౌడ్ , చింతకింది కృష్ణ గౌడ్, అన్నం రవీందర్ గౌడ్, మెదక్ పట్టణ గౌడ సంఘ సభ్యులు, జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కాకులవరం వేదవ్యాస్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): ఓపెన్ స్కూల్లో ప్రత్యేక అడ్మిషన్లు చేపడుతున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ విఠల్ తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9 నుంచి 13 వరకు ప్రత్యేక అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. పేటలోని ఓపెన్ స్కూల్లో ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. దరఖాస్తు జిరాక్స్ స్థానిక కార్యాలయంలో అందజేయాలని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడల నిర్వహణ అభినందనీయం



క్రికెట్ పోటీలను బ్యాటింగ్ చేస్తూ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

నర్సాపూర్: క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ చెప్పారు. నర్సాపూర్‌కు చెందిన సుల్తాన్ క్రికెట్ టీం సభ్యులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన క్రికెట్ పోటీలను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో శరీర ధారుడ్యం పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. అనంతరం సుల్తాన్ టీం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మసియోద్దీన్, హజ్జు, జావెద్, షంషొద్దీన్, కౌన్సిలర్ యాదగిరి, సర్పంచ్ శ్రీశైలంయాదవ్, సురేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన సర్పంచ్‌లు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలువురు సర్పంచ్‌లు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం కలిసినట్లు తెలిపారు. మక్క రాజీపేట సర్పంచ్ శ్రీనివాస్ గ్రామ నాయకులతో ఎంపీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, గ్రామంలో చేయాల్సిన అభివృద్ధి గురించి చర్చించారు. వల్లూర్ సర్పంచ్ ఆనందాస్ మహేశ్వరీ గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు విశ్వేశ్వర్‌రావు, రైతు సమన్వయ కమిటీ మండల కన్వీనర్ జింక శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.



ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఆర్థికసాయం

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదివారం జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రమైన శివ్వంపేటకు చెందిన మంగళి రాములు గుండెపోటుతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేల నగదు నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ 2500 అందజేశారు. పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన మహమ్మద్ సర్దార్, తాటి కృష్ణ, వడ్ల యాదగిరి, గంగర్‌గాని కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత ఆయన కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ శ్రీశైలం, ఉప సర్పంచ్ నవీన్, మాజీ ఎంపీటీసీ మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గౌరీశంకర్, కొండల్, అంజనేయులు తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

భక్తిశ్రద్ధలతో ఉర్సు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గంగాయిపల్లిలోని సద్గురు ఓం ఫాజిల్‌నగర్ చిష్తి అప్పగారి ఆశ్రమ 41వ వార్షికోత్సవ ఉర్సు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా ఉత్సవాల్లో భాగంగా దీపారాధన, ఖవ్వాలి, పుష్పాలంకరణ నిర్వహిస్తారు. 9న వేదాంత హారతి, ఖురాన్, ప్రసాద వితరణ జరుగుతుందని అప్పగారి ఆశ్రమ నిర్వాహకుడు నర్సింలు చిష్తి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

నేటి నుంచి పీర్ల గుట్టపై..

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణాన్ని ఆనుకోని ఉన్న పీర్ల గుట్టపై వెలసిన హజ్రత్ సయ్యద్ అహ్మద్ షా హుస్సేని సంబల్ షహీద్ ఉర్సు ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు ముత్తవల్లి యూనిస్‌ఖాన్ ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 9న ముతవల్లి ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపు, 10న ఖవ్వాలి, 11న అన్నదానం ఉంటుందని చెప్పారు. ఉర్సుకు తరలివచ్చే భక్తుల కోసం అన్ని రకాల సౌకర్యాల కల్పించినట్లు తెలిపారు.



నర్సాపూర్ రూరల్: ముస్తాబైన దర్గా



శివ్వంపేట(నర్సాపూర్): ఖవ్వాలి నిర్వహిస్తున్న దృశ్యం

బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం కేలండర్‌ల ఆవిష్కరణ



మెదక్‌జోన్: కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సంఘం నాయకులు

నర్సాపూర్: అఖిల భారత బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం కేలండర్‌ను నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన క్వార్టర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ హక్కుల కోసం పోరాడుతూనే బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ చత్రునాయక్, ఎంప్లాయీస్ సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు చాందిరాం, ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌జోన్: ఆల్ ఇండియా బంజారా ఎంప్లాయీస్ సేవా సంఘం(ఏఐబీఈఎస్) మెదక్ జిల్లా 2023 కేలండర్‌ను మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కొంపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు చాందీరామ్, ప్రధాన కార్యదర్శి సామ్య నాయక్, గౌరవ అధ్యక్షుడు కిషన్, అసోసియేట్ అధ్యక్షులు తారాసింగ్, చరణ్ సింగ్, మెదక్ డివిజన్ ప్రధాన కార్యదర్శి రతన్, నాన్య మదన్, నర్సాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ సింగ్, రవీందర్, రమేశ్, తూప్రాన్ డివిజన్ అధ్యక్షుడు చక్రు సింగ్, పలు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మధుసూదన్‌రెడ్డి భార్య హారతిరెడ్డి(25) వారం రోజుల క్రితం బాబుకు జన్మనించింది. మూడు రోజుల క్రితం ఆమె బ్రెయిన్‌డెత్ కావడంతో శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు హారతిరెడ్డి అవయవాలను దానం చేశారు. తను భౌతికంగా లేనప్పటికీ ఇతరుల ప్రాణం నిలపడంతో గ్రామస్తులు బాధిత కుటుంబాన్ని అభినందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఆదివారం ఆర్మీ జవాన్ మధుసూదన్‌రెడ్డిని పరామర్శి ఓదార్చారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ చంద్రకళ, ఎంపీటీసీ సులోచన, మాజీ ఎంపీటీసీ మహేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ నవీన్, బీఆర్ఎస్ నాయకులు సుధీర్‌రెడ్డి, రాంచెంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.



జవాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ప్రజాప్రతినిధులకు 'కంటి వెలుగు' ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ప్రజాప్రతినిధులకు వైద్యసిబ్బంది ఆదివారం కంటి వెలుగు అవగాహన పత్రికలు అందజేశారు. ప్రభుత్వం ఈనెల 18 నుంచి కంటి వెలుగు వైద్యశిబిరం నిర్వహించనుంది. కంటి వెలుగు అవగాహన సదస్సు ఈనెల 9న మనోహరాబాద్ మండలంలో జరుగనుండగా సర్పంచ్‌లు, ఉపసర్పంచ్, ఎంపీటీసీ ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆశకార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలకు అందజేశారు.

పడిపోయినా పట్టించుకోరా ?

రేగోడ్(మెదక్): ప్రమాదాలు జరగకుండా మూలమలుపుల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు కింద పడిపోతున్నా.. అధికారులు పట్టనట్లు ఉంటున్నారు. ఫలితంగా మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని పెద్దతండా సమీపంలో ఉన్న మూలమలుపుల వద్ద గతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. నాసిరకం సిమెంట్ వేయడం వలన కొద్దిరోజులకే సూచిక బోర్డు కిందపడిపోయింది. అటుగుండా వెళ్తున్న వాహనదారులకు దగ్గరికి వచ్చేంత వరకు మలుపులు తెలియక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయినా అధికారులు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కిందపడిపోయిన సూచిక బోర్డు

యాగానికి స్పందన

నర్సాపూర్: తన ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన పుత్రకామేష్టి యాగానికి మంచి స్పందన లభించిందని నర్సాపూర్‌లోని సువిజ్ఞాన ఆశ్రమం వ్యవస్థాపకుడు ఆచార్య సత్యవీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ ఆశ్రమంలో ఆదివారం పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకొని పుత్రకామేష్టి యాగం నిర్వహించామన్నారు. సంతానం కావాలనుకున్న దంపతులు యాగంలో పాల్గొన్నారన్నారు. యాగం అనంతరం అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులు తయారు చేసిన మందులు అందచేశామని వివరించారు. పుత్ర కామేష్టి యాగంలో పాల్గొనే వారు వివరాలు కావాలనుకునే వ్యక్తులు 92488 28666, 79817 50006 మొబైల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



పుత్రకామేష్టి యాగం ఆచరిస్తున్న దంపతులు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాల

- అభివృద్ధి పనులకు రూ. 2.28 కోట్లు
- పనులను పర్యవేక్షిస్తున్న జేసీ ప్రతిమాసింగ్
- సీఎంఓ నర్సింగరావు కృషితో నిధులు

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లాలోనే మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పూర్తిస్థాయి మౌలిక వసతులతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు ముమ్మరంగా పనులు జరుగుతున్నాయి. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించి, నేడు ఉన్నత స్థానంలో ఉన్న సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి సింగాయిపల్లి నర్సింగరావు చదువుకున్న పాఠశాలను ఆదర్శ పాఠశాలగా మార్చేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పాఠశాల అభివృద్ధికి రూ. 2.28 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు.

ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సీఎంఓ కృషితో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ కరీంనగర్ సింగరేణి యాజమాన్యం నుంచి చిన్నగొట్టిముక్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి రెండు కోట్ల 28 లక్షలు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో చేస్తున్న పనులను పలుమార్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో పాటు డీఈఓ రమేశ్ సింగరేణి అధికారి శ్రీరాములు, పంచాయతీ రాజ్, వివిధ శాఖల అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఆరున్నర ఎకరాల్లో విస్తరించి ఉన్న పాఠశాల స్థలంలో నిర్దేశించిన పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించిన నిధులతో అంగన్‌వాడీ భవనం, ఆరు అదనపు పాఠశాల గదుల నిర్మాణంతో పాటు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ప్రహరీ, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, వాకింక్ ట్రాక్, ఆడిటోరియం, స్విమ్మింగ్ పూల్, వంట గదులు, డైనింగ్‌హాల్ నిర్మాణంతో సోలార్ విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో 208 మంది విద్యార్థులు చదువుతున్నారు.



చిన్నగొట్టిముక్ల పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న జేసీ, అధికారులు (ఫైల్)

సంతోషంగా ఉంది



మా పాఠశాల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతుండడంపై సంతోషంగా ఉంది. ఏకగ్రతతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంది.

– హరిణి, విద్యార్థిని


సకల వసతులతో..



ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారనున్నాయి. జిల్లాలో ఎక్కడ లేని విధంగా మోడల్ పాఠశాలలో సకల వసతులతో ఉత్తమ బోధన జరగనుంది.

– ఇందుమతి, హెచ్ఎం

రుణపడి ఉంటాం



ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు కృషి చేసిన సీఎంఓ నర్సింగరావుకు రుణపడి ఉంటాం. చిన్నతనంలో చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం కృషి అమోఘం.

– బుచ్చునాయక్, ఎంఈఓ